క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

నకరికల్లు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 31 సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ.కాశయ్య బుధవారం తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి ఈ సమావేశం జరుగుతుందని అందరూ ప్రజాప్రతినిధులు, అధికారులు, కో–ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని సూచించారు.

నార్నెపాడులో రీసర్వేపై ర్యాలీ



నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో భూముల రీసర్వే పై బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని మూడవ విడత సర్వేలో భాగంగా పైలట్ గ్రామంగా నార్నెపాడు గ్రామాన్ని ఎంపిక చేయటం జరిగిందన్నారు. గ్రామంలో మూడు బృందాలు సర్వే చేపడతాయన్నారు. సర్వే చేసే భూమి వివరాలను సంబంధిత యజమానికి ముందుగానే తెలియజేయటం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో తహసీల్దార్, డీటీ, మండల సర్వేయర్, మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. భూ యజమానులు వారి భూములకు సంబంధించి పత్రాలను సర్వే సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్పంచ్ యలమంద, మండల సర్వేయర్ టి.సుధాకర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లిలో 'పొలం పిలుస్తోంది'



అచ్చంపేట: కందిపంటపై మారుక పురుగుల ప్రభావం అధికంగా ఉందని, ఇది కందిమొక్కపై గూడుకట్టుకుని పూతను నష్టపరుస్తుందని మండల ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొత్తపల్లిలో ఏఓ కంది పంటలను పరిశీలించారు. అనంతరం మారుక పురుగుల ఉధృతిని తట్టుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయ సిబ్బంది మణికుమార్, మాన్యానాయక్, రహీమ్, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

గోళ్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీఈఓ ఎస్.డేవిడ్‌రాజు పాల్గొని పంట సాగు యాజమాన్య పెట్టుబడిపై అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో పురుగు ఉధృతిని తగ్గించుకోవడానికి విషపు ఎరలు వాడాలని సూచించారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అవసరం



నకరికల్లు: నేరాలను అరికట్టడంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ చల్లా సురేష్ కోరారు. మండలంలోని త్రిపురాపురం గ్రామంలో బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం లాంటి దురలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. పార్టీలు, కులమత బేధాలను విడనాడి గ్రామస్తులంతా అన్నదమ్ముల్లా కలసి ఉండాలన్నారు. పేకాట, జూదం, కోడిపందేలు, బెల్టుషాపుల నిర్వహణ తదితర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా చోరీలు అరికట్టేందుకు సహకరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలను నడిపే ప్రతిఒక్కరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలు

తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు

క్రోసూరు: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున బుధవారం నుంచి ఎన్నికల నియామవళి కోడ్ అమలులోకి వచ్చిందని తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై ఆయన వివరిస్తూ మోడల్ కోడ్ ఎన్నికల ప్రక్రియ మార్చి 8 వరకు అమలులో ఉంటుందన్నారు. కోడ్ అతిక్రమిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగాదేవీ తిరుణాళ్ల హక్కుల వేలం మళ్లీ వాయిదా

క్రోసూరు: అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు గ్రామంలో ఈనెల 12న జరిగే గంగాదేవీ పేరంటాళమ్మ తిరునాళ్ల కోసం నిర్వహించే హక్కుల వేలం తిరిగి వాయిదా పడినట్లు ఈఓ ఎం.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. పాటకు సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవటంతో వాయిదా పడినట్లు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు వేలం వాయిదా పడినట్లు తెలిపారు.

గడ్డికాలం దాపురించింది!

వరిగడ్డి కొరతతో భారంగా మారిన పశుపోషణ

- ఏటికేడు పెరుగుతున్న వరిగడ్డి ధరలు
- అంతంతమాత్రంగానే ప్రభుత్వ ప్రోత్సాహం
- వరికోత యంత్రాలతోనే దుస్థితి
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించని అధికారులు



ట్రాక్టర్‌లో వరిగడ్డి అమ్ముతున్న దృశ్యం

అమరావతి: గ్రామీణ ప్రాంత రైతులకు పాడి, పంట రెండు అవసరమే. రెండు విధాలుగా వచ్చే ఆదాయమే రైతుల జీవనానికి ప్రధాన ఆధారంగా ఉపయోగ పడుతున్నాయి. కృష్ణానదీ పరీవాహక ప్రాంతమైన కృష్ణాడెల్టా, పల్నాటి ప్రాంతంలో వరిసాగు తగ్గుముఖం పట్టటంతో వరిగడ్డి ధర అమాంతం రెండింతలు పెరిగి రైతులను బాధిస్తోంది. ప్రస్తుతం పచ్చిగడ్డి దొరుకుతున్నప్పటికీ వచ్చే వేసవిలో పశుగ్రాసం దొరక్క రైతులు పాడి నుంచి వచ్చే ఆదాయాన్ని కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చే అవకాశం కనిపిస్తుంది. అధికారులకు ముందుచూపు కొరవడటంతో రానున్న కాలంలో పశువులకు ఎండుమేత కరువై పశువులను అమ్ముకోవాల్సి వచ్చే పరిస్థితి దాపురించే అవకాశం ఉంది.

మండుతున్న గడ్డి ధరలు..

మండలంలో నామమాత్రంగా వరిసాగు చేస్తుండటంతో వరిగడ్డికి డిమాండ్ ఏర్పడి కట్ట రూ.40–50 వరకు పలుకుతుంది. రోజుకు ఒక్కో పశువుకు వరిగడ్డి కోసమే రూ.80–100 వరకు ఖర్చుచేయాల్సివస్తుంది. కూలీల కొరత ఏర్పడటంతో వరి కోతలకు, నూర్పిళ్లకు వరికోత యంత్రాలపైనే ఆధారపడుతుండటంతో ఈ యంత్రాల ద్వారా కోసిన వరిగడ్డిని పశువులు ఇష్టపడకపోవటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. యంత్రాలతో కోసిన వరిగడ్డి కట్ట రూ.110–130వరకు ధర పలుకుతుంది. గతేడాది వరిగడ్డి ట్రక్కు సుమారు రూ.12వేలు ఉంటే ఈ ఏడాది రూ.15వేలకు చేరుకోవటం విశేషం. అలాగే దాణా కట్ట కూడా రూ.1150 –1200 మధ్య ధర పలుకుతుంది. రోజుకు ఒక్కో గేదెకు 2 కిలోల నుంచి 3 కిలోల వరకు మేపాల్సి ఉంది. ఈక్రమంలో రోజుకు ఒక్కో గేదెకు సగటున రూ.250–300 వరకు ఖర్చు అవుతుంది.

మేత కొరత తీర్చే చర్యలు శూన్యం..

పేద రైతులకు పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలిచ్చేవారే కానరావడం లేదు. ప్రభుత్వం నూతనంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల రక్షణ కోసం గోకులం షెడ్లు మంజూరు చేసింది కానీ పశువుల కొనుగోలు ఎటువంటి ప్రోత్సాహకాలు ఇంతవరకు ప్రకటించలేదు ఇప్పటి వరకు వేసవిలో రానున్న మేతకొరత తీర్చడానికి ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గతంలో సైలేజ్‌గడ్డిని కిలో రూ.2కి అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుత ప్రభుత్వం సైలేజీ గడ్డి ఉత్పత్తి ప్రారంభించటానికి తీసుకున్న చర్యలు కూడా శూన్యమనే చెప్పాలి. రైతులకు ప్రభుత్వం సహకారం అందించి పశుగణాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మిశ్రమ దాణా పంపిణీ ఏదీ?

మండలంలో 13,000కు పైగా పాడి గేదెలు, ఆవులు ఉండగా వాటి ఒక్కోదాని నుంచి సగటు పాల ఉత్పత్తి 6 లీటర్లు వస్తున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా ప్రభుత్వం పశువుల మేత విత్తనాలను, సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ చేసే పరిస్థితులు కానరావడం లేదు. గ్రామాలలో సన్న, చిన్నకారు రైతులు పశుగ్రాసం తప్పక కొనుగోలు చేయాల్సిరావడం, ఎండుగడ్డి కొరత ఏర్పడటంతో పశువుల పెంపకమే ప్రశ్నార్థకమైంది. మెట్ట ప్రాంతాలలో నీటివసతి లేకపోవటంతో వేసవిలో వరి గడ్డి పైనే ఆధార పడాల్సివస్తుంది.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

వర్షాకాలంలో పచ్చిమేత దొరికినప్పటికీ వేసవిలో మేత సమస్యను అధిగమించటానికి రైతులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. రైతులు పశుగ్రాసం కోసం జొన్నచొప్ప, మొక్కజొన్న చొప్పను వేసవికి నిల్వ చేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో 10 సెంట్ల నుంచి అర ఎకరం వరకు మేత సాగు చేయటానికి రైతులకు సాయం అందిస్తున్నాం. ఈ ఏడాది సంపూర్ణ మిశ్రమ పశువుల దాణాపై ఇంతవరకు ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు

– వెంకట్రామయ్య, అసిస్టెంట్ డైరక్టర్, పశుగణాభివృద్ధిశాఖ, అమరావతి

ఉత్తమ తహసీల్దార్‌కు ఘనసన్మానం



అచ్చంపేట: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించినందుకు గాను రిపబ్లిక్ వేడులలో జిల్లా కలెక్టరు నుంచి ఉత్తమ తహసీల్దారుగా అవార్డు స్వీకరించిన జి.శ్రీనివాసయాదవ్‌ను రెవెన్యూ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, మండల పెద్దలు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోటయ్య, తిరువాయిపాటి అంజనేయులు, రాయిడి సాంబశివుడు, జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధుల పరిరక్షణకు చట్టాలు

సత్తెనపల్లి: వయో వృద్ధుల పరిరక్షణకు చట్టాలు భరోసా కల్పిస్తున్నాయని పారాలీగల్ వలంటీర్, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కోసం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది కళ్ళం వీర భాస్కరరెడ్డి మాట్లాడుతూ వయో వృద్ధుల పరిరక్షణకు, వారికి భరోసా కల్పించే అనేక చట్టాలు ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్స్ వ్యక్తిగత జీవనానికి, వారి ఆస్తుల పరిరక్షణకు సైతం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. న్యాయస్థానంలో కూడా వీరి తరఫున దాఖలైన కేసులను త్వరితగతిన విచారించడం జరుగుతుందన్నారు. ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు న్యాయ సేవాధికార సంస్థ విధులు, లోక్ అదాలత్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

పాస్టర్లకు అన్నివిధాలా సహకారం అందిస్తాం



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ప్రత్యేక ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

రాజుపాలెం: పాస్టర్లకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని కోటనెమలిపురిలో గల సజీవుని ప్రార్థన మందిరంలో దైవ సేవకుల ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ కోటనెమలిపురి నుంచి కొండమోడు వరకు సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రార్థన మందిరాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం అలైవ్ మినిస్ట్రీస్ ట్రస్ట్ డైరెక్టర్, జీఎస్ఆర్ రెడ్డి కన్నాను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. గుత్తా వెంకట్రావు, అంకాళ్ల ప్రభుదాసు, డాక్టర్ వట్టెంపూడి పవన్‌కుమార్, శనగపూల నరసింహారావు, సానికొమ్ము కోటిరెడ్డి, తోట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న వినుకొండలో జరిగే పల్నాడు జిల్లా విద్యా సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా కన్వీనర్ ఎస్‌సీఎం సుభాని, జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి సాంబశివరావు, డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరావు, టీడీపీ నాయకుడు పూజల వెంకట కోటయ్య ఉన్నారు.

సాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలి



కెనాల్స్ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

క్రోసూరు: క్రోసూరు, వేల్పూరు, గ్రంథసిరి గ్రామాల రైతుల సాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రవిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం సాగునీటినందించాలని క్రోసూరు అచ్చంపేట, ఆర్అండ్‌బీ రోడ్డుపై రైతులు రాస్తారోకో చేసి, కెనాల్స్ జేఈ బండి శ్రీనివాసరావును కలిసి చర్చించారు. అదేవిధంగా ఫోన్‌లో ఐడీసీ ఈఈ దృష్టికి సమస్యను రవిబాబు తీసుకెళ్లారు. ఐడీ సీఈఈ మాట్లాడుతూ వేల్పూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములో మరమ్మతులు చేయాల్సి ఉందని వాటికి సంబంధించిన అంచనాలను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. అనంతవరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా రైతులకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్బంబగా జి.రవిబాబు మాట్లాడుతూ మూడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల పరిధిలో సుమారు 10 వేల ఎకరాలు ఆయకట్టు ఉందని, ఈ మూడు స్కీములు ఆగిపోవటం వలన ఈ ప్రాంతంలోని మిర్చి, మొక్కజొన్న ఇతర రబీ పంటలు సాగు చేసిన రైతాంగానికి సాగునీరు కొరత ఏర్పడిందని తెలిపారు. తక్షణమే సాగునీటి సమస్యను పరిష్కరం చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం అచ్చంపేట, మండల కార్యదర్శి రావెల వెంకటేశ్వర్లు, రైతులు పరుచూరి శ్రీనివాసరావు, కిలారి మందారావు, పరుచూరి చిన్న వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ.. ప్రతి విద్యార్థికి రక్షణ

తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనీ కుమారి



శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న అంజనీకుమారి

సత్తెనపల్లి: ఆరోగ్య సంరక్షణ ప్రతి విద్యార్థికి రక్షణ అని, ప్రస్తుత పరీక్షల సమయంలో ఆరోగ్యం బాగుంటేనే మంచి విజయాలను సాధించగలరని తెలంగాణ రాష్ట్ర సీఎస్సీ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పీవీపీ అంజనీకుమారి అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు, మందులు, టూత్ పేస్ట్, బ్రష్‌ల పంపిణీ శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నోటి శుభ్రత అన్ని వ్యాధులను దూరం చేస్తుంద న్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు హెల్ప్ ఫౌండేషన్ చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. పట్టణానికి చెందిన శ్రీ సాయి కృష్ణ డెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యుడు పి.శివరామకృష్ణ మాట్లాడుతూ దంత సంరక్షణపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రమం తప్పకుండా రోజుకు రెండుసార్లు దంతాలను శుభ్రపరచుకోవాలన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ కంచర్ల శిరీష్ బాబు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, సోమశేఖర్, టీచర్ మస్తాన్ ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

క్రోసూరు: అఖిలభారత అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా స్కీం 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్బంగా ఈ స్కీంను సంస్థాగతం చేయాలని గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మండలంలోని అంగన్‌వాడీలు వినతిపత్రాలు పంపారు. అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయు క్రోసూరు ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బి.జయలక్ష్మి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించి రాజ్యాంగ ప్రాతమిక హక్కు అయిన ఆరు సంవత్సరాల లోపువయసు కలిగిన పిల్లలందరికీ శిశుసంరక్షణ విద్యను కట్టుదిట్టంగా అమలు జరిపేలా చట్టం చేయాలని, అందుకు సరిపడా నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించవలసినదిగా కోరుతూ గౌరవ రాష్ట్రపతికి దరఖాస్తులు పంపిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు దానమ్మ, భూలక్ష్మి, దుర్గభవానీ, షాజిరా, వెంకట్రావమ్మ, మాణిక్యం, రిహానా తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏపీ ఎస్ఆర్‌టీసీ డిపోలో ఈ నెల 30న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ బుధవారం తెలిపారు. సత్తెనపల్లి పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ప్రయాణ అవసరాలకు సంబంధించి సలహాలు, సూచనలను 9959225429 నెంబరులో తెలియజేయవలసినదిగా కోరారు.

రేపు అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలో వేంచేసియున్న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 31న వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమ జరుగుతుందని ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు (కొండలు) బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 31న ఉదయం 6 గంటలకు గణపతి పూజ, 7 గంటలకు అమ్మవారి గుడి వద్ద నుంచి అభిషేకానికి కావలసిన పూజాద్రవ్యాలను సంఘం బజార్‌లోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి అమ్మ వారి గుడి వరకు తీసుకొని వచ్చే కార్యక్రమం ఉంటుందన్నారు. 10 గంటలకు సామూహిక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు కుటుంబ సమేతంగా అన్నసంతర్పణ జరుగుతుందన్నారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

క్రోసూరు: వాసవీక్లబ్ పూర్వ అధ్యక్షుడు కట్టమూరి అప్పారావు గృహంలో మండల వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. కార్యవర్గ ఎన్నికకు నరసరావుపేట వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ మునగాల చిరంజీవి, జిల్లా సెక్రటరీ పోతుగంటి రమేష్, కోశాధికారి వెల్లంపల్లి కేశవరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యక్షుడిగా గ్రంధి విజయ్‌కుమార్, సెక్రటరీగా తొమ్మండ్రు వాసంతి, ట్రెజరర్‌గా కట్టమూరి చెన్నకేశ్వరీలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ ప్రోగ్రాం అధికారి తొమ్మండ్రు నాగేశ్వరావు, గుగ్గిలం విజయశేఖర్, కూరపాటి కృష్ణ, కూరపాటి లక్ష్మీనారాయణ, కోట భాస్కర్, చుండూరు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నకరికల్లు: ప్రమాదవశాత్తు బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో కాలువలో జారిపడి గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం పోలీసులు గుర్తించారు. ఫిరంగిపురం గ్రామానికి చెందిన మహమ్మద్ తాజుద్దీన్ రంగురాళ్ల కోసం వచ్చి త్రిపురాపురం సమీపంలోని కాలువలో జారిపడి గల్లంతైన విషయం విధితమే. బెల్లంకొండ బ్రాంచికెనాల్‌లో లభ్యమైన మృతదేహాన్ని వెలికితీసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేటలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

నిబంధనల మేరకు సెలవు పెట్టుకునే హక్కుఉంది

పీఆర్టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు



సత్తెనపల్లి: ప్రభుత్వం కల్పించిన సెలవులను నిబంధనల మేరకు ఉపాధ్యాయులు వినియోగించుకునే హక్కు ఉందని, వాటిని నిరోధించడం అధికారులు, పాలకులకు సరికాదని పీఆర్టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసుబాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల సందర్శనకు వచ్చిన మంత్రులు, పాలకులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి సూచనలు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న సెలవులను వాడుకోవడానికి వీలులేదని హుకుం జారీ చేయడం, దానిని డీఆర్సీ సమావేశంలో చర్చించి తగు చర్యలకు సిఫార్సు చేయడం మంత్రిస్థాయికి తగదన్నారు. 117 జీవో రద్దు సాకుతో పాఠశాలల విలీనం సరికాదన్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్ల సాకుతో యూపీ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం అశాస్త్రీయమన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ముఖ్యంగా బాలికలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. నిపుణులతో చర్చించి విద్యా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ముప్పాళ్లలో పశు ఆరోగ్య శిబిరం



ముప్పాళ్లలో గొర్రెకు టీకా వేస్తున్న వైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలో పశు ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరంలో మండల పశు వైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి పాల్గొని వైద్య సేవలందించారు. 22 పశువులకు సాధారణ చికిత్స, 19 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 16 పశువులకు కృత్రిమ గర్భధారణ, 54 పశువులకు చూడి పరీక్షలు, 768 పశువులకు నట్టల నివారణ మందు, 300 గొర్రెల బొబ్బర టీకాలు, 200 కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు అందించినట్లు వైద్యాధికారి తెలిపారు.

త్రిపురాపురంలో...

నకరికల్లు: ఆరోగ్యవంతమైన పాడిగేదెలు అధిక పాలను ఉత్పత్తి చేస్తాయని మండల పశువైద్యాధికారి సుజాత తెలిపారు. మండలంలోని త్రిపురాపురం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం బుధవారం నిర్వహించారు. 13 గేదెలకు సాధారణ వైద్యం, 14 గేదెలకు గర్భకోశ చికిత్స, 17 గేదెలకు చూడి పరీక్షలు చేశామని వైద్యాధికారి తెలిపారు.

రెడ్డిగూడెం, లక్ష్మీపురం తండాల్లో...

రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెం, లక్ష్మీపురం తండాలలో పశువైద్య శిబిరాలు బుధవారం నిర్వహించారు. రెడ్డిగూడెం పశువైద్య శిబిరంలో డాక్టర్ కె.నాగేశ్వరరావు పాల్గొని పశువులకు వైద్య సేవలు అందించారు. అదే విధంగా లక్ష్మీపురంతండాలో డాక్టర్ శివకుమారి పశువులకు వైద్య పరీక్షలు అందించారు. పశువైద్య సిబ్బంది రమ్య, ఇందు, తేజ, ఆదినారాయణ, ఆనోక్, అఖిల, జగన్‌మోహన్‌రావు, రాజేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నాగవరంలో...

నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరంగ్రామంలో బుధవారం పశుఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. గ్రామ ప్రజాప్రతినిధులు, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు, పశుపోషకులు పాల్గొన్నారు.

3న ఎన్‌సీసీ క్యాడెట్లకు పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మిట్టపల్లి కోటేశ్వరరావు, కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: గుంటూరు గ్రూప్ పరిధిలోని ఎన్‌సీసీ క్యాడెట్స్ అంతర కళాశాలల పోటీలు ఫిబ్రవరి 3వ తేదీన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు కళాశాల ఛైర్మన్ మిట్టపలి వెంకటకోటేశ్వరరావు తెలిపారు. కళాశాలలో బుధవారం పోటీల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఈసీ కళాశాల జూబ్లీషన్ 2కే–25లో భాగంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరక్టరేట్, గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ అనుమతితో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్లటూన్ డ్రిల్, గార్డ్ ఆఫ్ హనర్, అబ్స్టాకిల్ రన్, టగ్ ఆఫ్ వార్, గ్రూప్ డాన్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. గుంటూరు గ్రూప్ పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 400మంది క్యాడెట్స్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మొదటి సారిగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్యాడెట్స్‌లో పోటీతత్వం, టీమ్ వర్క్, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకునేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు పారుదలపై ఘర్షణ

బొల్లాపల్లి: ఇరువురు మహిళల మధ్య మురుగునీరు పారుదల విషయంలో వివాదం నెలకొని ఘర్షణకు దారి తీసి ఒక మహిళ ఇంటిపై మరో మహిళ వర్గీయులు దాడులకు పాల్పడిన సంఘటన మండలంలోని సోలాయపాలెంలో జరిగింది. బండ్లమోటు పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అన్నంగి కోటమ్మకు చెందిన ఖాళీస్థలంలో వలస వచ్చిన మిరప కూలీలు ఉంటున్నారు. ఈ కూలీలకు చెందిన మురుగునీరు లాగా లక్ష్మి ఇంటి ముందుకు వస్తుండగా మురుగునీరు రానివ్వకుండా చూడమని చెప్పడంతో వివాదం నెలకొంది. వివాదం కాస్త ముదిరి ఘర్షణకు దారి తీసింది. అన్నంగి కోటమ్మ వర్గీయులు కొందరు రాళ్లు, కర్రలతో లాగా లక్ష్మి ఇంటిపైకి దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసి లక్ష్మిని వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మరొక వర్గానికి చెందిన అన్నంగి కోటమ్మ, అన్నంగి రామకోటయ్యలకు గాయాలయ్యాయి. వీరిరువురు వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.